# నులిపేద్దాం

## నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

- ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీకి సర్వం సన్నద్ధం
- ఏడాది నుంచి 19 ఏండ్లలోపు పిల్లలకు..
- పరిశుభ్రత లోపంతో రక్తహీనత
- ఏర్పాట్లు పూర్తి చేసిన వైద్య, ఆరోగ్యశాఖ

నులిపురుగుల నివారణ మాత్రలు చిన్నారికి వేస్తున్న ఆరోగ్య కార్యకర్త (ఫైల్)

## పాలమూరులో 2,78,511మంది

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జూలై 19 : జిల్లా వ్యాప్తంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడాది నుంచి ఐదేండ్ల వయస్సు ఉన్న పిల్లలకు ఉచితంగా మాత్రలు అందించనున్నారు. 6-19 ఏండ్ల వారికి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా వేయనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 1 -19 ఏండ్ల వారు 2,78,511 మంది ఉన్నారు. 1,185 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,240 మంది పిల్లలు, లక్షకుపైగా విద్యార్థులు బడులు, కళాశాలల్లో ఉన్నారు. బడి బయట ఉన్న పిల్లలు 6,769 మంది ఉన్నారు. కార్యక్రమ నిర్వహణకు ఆరుగురు ప్రోగ్రాం అధికారులు, మెడికల్ ఆఫీసర్లు 23, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మండల వైద్యాధికారులు, ప్రిన్సిపాళ్లకు బాధ్యతలు అప్పగించారు.

## 'పేట'లో సర్వం సిద్ధం

- నారాయణపేట జిల్లాలో 1,56,610 మందికి మాత్రలు

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న చైల్డ్‌పర్సన్ అనసూయ, డీఎంహెచ్‌వో (ఫైల్)

నారాయణపేట టౌన్, జూలై 19 : గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, బడి బయట ఉన్న 1-19 ఏండ్లలోపు పిల్లలందరికీ మాత్రలు వేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఆయా ప్రాంతాలకు మాత్రలను చేరవేసినట్టు డీఎంహెచ్‌ఈవో గోవిందరాజు తెలిపారు. అనారోగ్యం, ఇతర కారణాలతో మాత్రలు వేసుకోని వారికి 27వ తేదీన వేయనున్నారు.

### అందరికీ వేసేలా చర్యలు

జిల్లాలో 19 ఏండ్లలోపు వయస్సు వారు 1,56,610 మంది ఉన్నారు. వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా చర్యలు చేపట్టారు. ఏడాది నుంచి రెండేండ్లలోపు చిన్నారులకు సగం మాత్ర, 2-3ఏండ్ల వారు ఒక మాత్రను మింగాలి. అదేవిధంగా 3-19 ఏండ్లలోపు పిల్లలు ఒక మాత్రను చప్పరించి మింగాలని వైద్యులు సూచిస్తున్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

నాగర్‌కర్నూల్, జూలై 19 (నమస్తే తెలంగాణ) : ఈగలు, దుమ్ము, ధూళితో కూడిన కలుషిత ఆహారం, తినుబండారాలను తీసుకోవడంతో పిల్లల్లో నులిపురుగు జన్మిస్తుంది. కాళ్లకు చెప్పులు లేకుండా బహిరంగ ప్రదేశాలు, మరుగు దొడ్లకు వెళ్లడం వల్ల ఈ పురుగులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. అలాగే ఆకుకూరలు, పండ్లు, వంట సరుకులను మంచినీటితో శుభ్రం చేయకుండా వండటం, అన్నం తినే ముందు, తిన్న తర్వాత సరిగ్గా చేతులను కడుక్కోకపోవడం వల్ల కూడా ఈ పురుగులు జన్మించే పరిస్థితులున్నాయి. ఇలా నులి, కొంకి, ఏలికపాము వంటి పలు రకాల పురుగులు జన్మించి పిల్లల కడుపులో స్థావరం ఏర్పాటు చేసుకుంటాయి. ఇవి పిల్లల కడుపులో కి ప్రవేశించినప్పటి నుంచి అనారోగ్య లక్షణాలు కనిపిస్తాయి. ఫలితంగా వారు బరువు తగ్గడం, రక్తహీనత, ఆకలి మందగించడం, కడుపునొప్పి, పోషకాహార లోపంతో బలహీనంగా మారుతారు. ఎంత ఆహారం తీసుకున్నా అనారోగ్యంగా ఉంటారు. దీంతో పిల్లల్లో సంపూర్ణ ఎదుగుదల ఆగిపోతుంది. ఇది చదువు పైనా ప్రభావం చూపిస్తుంది. ఇలా పిల్లల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపించే నులి పురుగులను నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాదికి రెండుసార్లు నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తోంది. ఇందులో భాగంగా గురువారం జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేయనుంది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఈ మాత్రలను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అందించనున్నారు. ఇప్పటికే జిల్లాలకు చేరిన ఈ మాత్రల పంపిణీకి వైద్యశాఖ రోగ్య శాఖ ఏర్పాట్లు చేపట్టింది. అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

### నివారణ ఇలా

- మలబద్ధకం ఏర్పడకుండా చూసుకోవాలి
- కాచి, వడపోసిన మంచినీళ్లనే తాగాలి
- భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి
- పీచు పదార్థాలున్న ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి
- తీపి పదార్థాలను తక్కువగా తీసుకోవాలి

### ఏర్పాట్లు పూర్తి చేశాం

జిల్లాలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశాం. పరిశుభ్రత పాటించకపోవడం, కట్టే ఆహారం, తినుబండారాలను తినడం వల్ల పిల్లల కడుపులో నులి పురుగులు జన్మిస్తాయి. ఇది వారి శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. చదువులోనూ వెనుకబడే అవకాశం ఉంది. ముందు జాగ్రత్త పాటించడం మేలు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీల్లో కలిపి 2,07,836 మంది పిల్లలకు మాత్రలు వేస్తాం. దీనికోసం 265మంది ఏఎన్ఎంలు, 2వేల మందికిపైగా అంగన్‌వాడీలు, 876మంది ఆశ కార్యకర్తలను నియమించాం.

- సుధాకర్‌లాల్, డీఎంహెచ్‌ఓ, కందనూలు

### నాగర్‌కర్నూల్ జిల్లాలో 1-19 ఏండ్ల పిల్లలు

| వయస్సు | బాలురు | బాలికలు | మొత్తం |
|---|---|---|---|
| 1-2 | 8,545 | 8,235 | 16,780 |
| 2-3 | 9,842 | 9,767 | 19,609 |
| 3-19 | 86,225 | 85,222 | 1,71,447 |
| మొత్తం | 1,04,612 | 1,03,224 | 2,07,836 |

## జోగులాంబ గద్వాల జిల్లాలో 1,68,425 మందికి..

- మాత్రలు పంపిణీ చేయనున్న వైద్య సిబ్బంది
- అంగన్‌వాడీలు, పాఠశాలలు, హెల్త్ సెంటర్లలో పంపిణీ

ప్రచార నిమిత్తం ఏర్పాటు చేసిన బెలూన్

గద్వాల టౌన్, జూలై 19 : జిల్లా వ్యాప్తంగా నేడు నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈక్రమంలో వైద్యాధికారులు నులి పరుగుల వ్యాప్తి విషయాలను వెల్లడించారు.

### వ్యాప్తి చెందుతుంది ఇలా..

నులి, కొంకి పురుగులు, నట్టలు, (ఎలికపాములు) మనిషి పేగులను ఆవాసంగా చేసుకుని జీవిస్తాయి. ఈ పరాన్నజీవులు వేలసంఖ్యలో గుడ్లను పెట్టగా మలం ద్వారా బయటికి వస్తాయి. బహిరంగ మలవిసర్జన ద్వారా మట్టిలో కలిసిపోయిన గుడ్లు తీవ్ర వాతావరణ పరిస్థితులను తట్టుకుని రెండేండ్ల వరకు జీవించి ఉంటాయి. వర్షాలు కురిసినప్పుడు ఈ గుడ్లు జల వనరులు, పొలాల్లోకి చేరుతాయి. సరిగా శుద్ధి చేయని నీటి ద్వారా గుడ్లు కడుపులోకి చేరి కొంకి, నులిపురుగులుగా మారుతాయి.

### లక్షణాలు

రక్తహీనత, తద్వారా ఆకలి, నిద్ర లేకపోవడం ప్రధాన సమస్య. అదేవిధంగా పిల్లల్లో ఎదుగుదల తగ్గుతుంది. జ్ఞాపక శక్తి తగ్గి శరీరంపై దద్దుర్లు ఏర్పడతాయి. కడుపునొప్పి, విరోచనాలు, అతిసారం, వాంతులు, మలంలో రక్తం పడటం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉంది. భోజనం తర్వాత 400 మిల్లీ గ్రాములు ఆల్బెండజోల్ మాత్రను మింగితే పిల్లల్లో ఎదుగుదల, ఏకాగ్రత, వ్యాధినిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతులుగా ఉంటారు. మాత్రలతో ఎలాంటి దుష్పరిణామాలు ఉండవు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి.



ఆల్బెండజోల్ మాత్రలు

### జిల్లాలో 1,68,425 మంది చిన్నారులు

నులి పురుగుల నివారణకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సన్నద్ధమైంది. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలలు, కళాశాలల్లో 1 నుంచి 19 ఏండ్లలోపు 1,68,425మంది ఉన్నారు. లక్ష్యం మేరకు 2,34,000 మాత్రలు సిద్ధం చేశారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మాత్రలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేపట్టారు.

## రెండింతల స్టాక్‌తో సిద్ధంగా ఉన్నాం

- వనపర్తి జిల్లాలో 1,62,846మందికి మాత్రలు పంపిణీ
- డీఎంహెచ్‌వో రవిశంకర్

అంగన్‌వాడీలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు, జూలై 19 : జిల్లాలో గురువారం నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రవిశంకర్ తెలిపారు. రెండింతల స్టాక్‌తో ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. 1-19 ఏండ్ల వయస్సు ఉన్న వారికి ఈ మాత్రలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ప్రపంచంలో 25శాతం మంది పిల్లలు నులిపురుగులతో బాధపడుతున్నట్లు సర్వేలో తేలడంతో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఏడాది నుంచి 19 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న వారు 1,62,846 మంది ఉన్నారన్నారు. వారందరికీ అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు, అర్బన్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, సివిల్ దవాఖాన, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో మాత్రలను పంపిణీ చేస్తామని చెప్పారు. పెద్దలు కూడా ఈ మాత్రలను వేసుకోవచ్చని, అనారోగ్యంతో బాధపడుతున్న, క్యాన్సర్ వ్యాధి సోకిన పిల్లలకు మాత్రం ఈ మాత్రలు వేయొద్దని సూచించారు. గురువారం మాత్రలు అందని పిల్లలకు ఆరు రోజుల తర్వాత అందిస్తామని చెప్పారు.

# ఏ ప్రభుత్వం కావాలో తేల్చుకోవాలి

- కాంగ్రెస్ హయాంలో దయ్యాలు తిరిగే టైంలో కరెంట్
- బీఆర్ఎస్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్
- రేవంత్‌రెడ్డే రైతులకు భేషరత్తుగా క్షమాపణ చెప్పాలి
- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- ధన్వాడ, మరికల్ రైతువేదికల్లో అవగాహన సదస్సు

నారాయణపేట, జూలై 19 : పగలు మూడు గంటలు, రాత్రి దయ్యాలు తిరిగే టైంలో మూడు గంటల కరెంటిచ్చి రైతుల ప్రాణాలను తీసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మండిపడ్డారు. 2014 తర్వాత బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రూ.38వేల కోట్లతో విద్యుత్ శాఖను ఆధునీకరించి నేడు సాగుకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు. సాగుకు మూడు గంటల కరెంట్ చాలని మాట్లాడిన రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మరికల్, ధన్వాడ రైతువేదిక వద్ద రైతులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014 ముందు జిల్లాలో 3.69లక్షల ఎకరాల్లో సాగు కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక నేడు 4లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయనున్నారు. 2014 ముందు వరకు కోయిల్‌సాగర్ కింద రెండు పంటలు పండేది కాదని.. నేడు మరికల్ మండలం రైతులు రెండు పంటలు పండిస్తున్నారన్నారు. ప్రాజెక్టు కట్టినప్పటి నుంచి తెలంగాణ రాక ముందు వరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క మరమ్మతు కూడా చేయలేదని, బీఆర్ఎస్ వచ్చాక కోయిల్‌సాగర్‌కు రూ.32కోట్లతో పనులు చేపట్టిందన్నారు. రూ.75వేల కోట్లు రైతుబంధు ద్వారా పెట్టుబడి సహాయం చేశామని.. ఎల్ఐసీ ప్రీమియం కింద రూ.1,500కోట్లను ప్రభుత్వం చెల్లిస్తున్నదన్నారు. మరికల్ మండలంలో 245మంది రైతులు చనిపోతే రూ.12.25కోట్లు, ధన్వాడ మండలంలో 137మంది రైతులు చనిపోతే రూ.6.25కోట్లు వారి నామినీల ఖాతాల్లో జమ చేశామన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రైతులను ఆదుకోవాలని, ఆ తర్వాత తెలంగాణ గురించి మాట్లాడాలని హితవు పలికారు. మూడు గంటల కరెంట్ ఇస్తామన్న కాంగ్రెస్ కావాలా? 24 గంటలు ఇచ్చే బీఆర్ఎస్ పార్టీ కావాలా? అనేది రైతులు తేల్చుకోవాలన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి తన అహంకారపు మాటలు వీడి చెంపలు వేసుకొని రైతులకు క్షమాపణ చెప్పాలని, అప్పటి వరకు రైతుల తరపున పోరాడుతూనే ఉంటామన్నారు. సమావేశంలో రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ సురేఖ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు వహీద్, వైస్ ఎంపీపీ రవికుమార్, మరికల్, ధన్వాడ రైతుబంధు సమితి అధ్యక్షులు సంపత్‌కుమార్, వెంకట్‌రెడ్డి, సర్పంచులు గోవర్ధన్, అమరేందర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్లు మల్లేశ్, సురేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

మరికల్ రైతువేదికలో సమావేశానికి హాజరైన రైతులు

### నోరు అదుపులో పెట్టుకో రేవంత్!

బాధ్యతాయుమైన పదవిలో ఉండి రైతులను చులకన చేసి మాట్లాడితే కొండగల్ నియోజకవర్గంలోనే రేవంత్‌రెడ్డిని మట్టి కరిపిస్తరు. కాంగ్రెస్ హయాంలో విత్తనాలు, ఎరువులు, కరెంట్ కోసం ధర్నాలు, రాస్తారోకోలు చేసి అవస్థలు పడ్డాం. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాకే మాకు 24 గంటల కరెంట్ వస్తున్నది. అన్నదాతను ఆదుకున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే. రేవంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది.

- గౌని శ్రీనివాసులు, రైతు, ఎంనోనిపల్లి

### కర్ణకులలో పెట్టుకుంటే కాటికే..

కర్ణకులతో పెట్టుకుంటే కాంగ్రెస్ పార్టీ కాటికే పోతుంది. ఉచిత కరెంటుపై అహంకారంగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి. మీ పాలనలో రాత్రి పూట పొలం కాడ ఉంటేనే ఎకరా భూమి కూడా పారలే.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాకే మాకు 24 గంటల కరెంట్ వస్తోంది. ఇప్పుడు రాత్రి వేళ ఇంట్లోనే నిండ్రపోతున్నం. మాకు పాత రోజులు వద్దు.. కేసీఆర్ ప్రభుత్వం రైతులపై ప్రేమ చూపుతున్నది. కాంగ్రెస్ కపట ప్రేమను ప్రదర్శిస్తున్నది. ఆ పార్టీకి కాలం చెల్లింది. జాగ్రత్త రేవంత్.. మాతో పెట్టుకుంటే మీరు కాటికి పోతారు బిడ్డ.

- కృష్ణారెడ్డి, రైతు, అప్పంపల్లి

# న్యూట్రిషన్ కిట్ సూపర్ హిట్

- గర్భిణులకు ప్రభుత్వం ఆరోగ్య భరోసా
- ప్రసవం జరిగే వరకు రెండు సార్లు అందజేత
- పౌష్టికాహారం పంపిణీకి పెరిగిన ఆదరణ
- ఎప్పటికప్పుడు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- ఉమ్మడి జిల్లాలో 26,094 మందికి పంపిణీ

వనపర్తి, జూలై 19 : గర్భం దాల్చిన సమయంలో మహిళలకు సరైన పౌష్టికాహారం అందక పుట్టిన బిడ్డలు అనారోగ్యం బారిన పడడం, కొందరు కడుపులోనే చనిపోవడం వంటి సంఘటనలు జరుగుతుంటాయి. ఇవి పునరావృతం కావొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం సరికొత్త ఆలోచనతో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం డిసెంబర్ 21, 2022న రాష్ట్ర వ్యాప్తంగా 9 జిల్లాలో ప్రారంభమైంది. కాగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభమైంది. ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా దాఖ్లా వేడుకల్లో భాగంగా జూన్ 10న వైద్య, ఆరోగ్య దినోత్సవాన్ని పుర స్కరించుకొని అన్ని జిల్లాల్లో శ్రీకారం చుట్టింది. వనపర్తి జిల్లాలో కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రారంభించారు. దీంతో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందజేసి వీటితో కలిగే లాభాలు, వాడే విధానాన్ని వివరించారు. మహిళ గర్భం దాల్చిన సమయం మొదలుకొని ప్రసవం జరిగే వరకు ఆయా గ్రామాల్లో, పట్టణాల్లో ఆశ కార్యకర్తలు వారి వద్దకు వెళ్తూ.. ప్రతి నెలా ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. క్రమం తప్పకుండా 102 వాహనంలో గర్భిణులకు అందుబాటులో, దగ్గరలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి రక్త పరీక్షలను చేయిస్తున్నారు. అయితే పౌష్టికాహారలోపం ఉన్నట్లు ప్రధానంగా తేలుతున్నదని, దీనిని అధిగమించేందుకు ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్ల పంపిణీని మొదలుపెట్టింది.

### పీహెచ్‌సీల్లో రక్త పరీక్షలు

గర్భం దాల్చిన మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్తహీనత పరీక్షలు నిర్వహిస్తారు. గర్భం దాల్చిన మహిళలను ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు వారి పరిధిలో గుర్తిస్తారు. వారిని మూడు నెలల నుంచి ప్రసవమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించనున్నారు. ప్రతి నెలా పీహెచ్‌సీల్లో రక్త పరీక్షలను నిర్వహించి ఏమైనా సమస్యలు ఉంటే టీహబ్‌కు టెస్ట్ కోసం పంపిస్తున్నారు. ఆరోగ్య పరీక్షలు చేయడం, ఎత్తుకు తగిన బరువు ఉన్నారా..? లేదా అన్న విషయాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి గర్భిణుల హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తున్నారు. రక్తహీనత ఉన్న వారిపై ప్రత్యేక దృష్టికి కేంద్రీకరిస్తున్నారు. ఎనిమియాతో బాధపడే గర్భిణులకు పౌష్టికాహారం అందింపి వారిని ఆరోగ్య వంతులుగా చేయడం.. కడుపులోని బిడ్డ మరింత ఆరోగ్యంగా పుట్టడం కోసం ప్రొటీన్లు, విటమిన్లు కలిగిన పోషకాహారం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లో ఉంటున్నాయి. ఆయా పీహెచ్‌సీలు, జనరల్ దవాఖానల్లో గర్భిణీ వివరాలను తీసుకుని అందుకు సంబంధించిన ఫొటోను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నారు.

### న్యూట్రిషన్ కిట్లకు శ్రీకారం

మాతా శిశు మరణాలను తగ్గించడం ఒకవైపు.. మరో వైపు ప్రదవాఖానలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఒక్కో కిట్‌కు రూ.1,962ను ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. గర్భిణులు 13 నుంచి 24 వారాల మధ్య న్యూట్రిషన్ కిట్, తర్వాత నెల రోజులకు 28 నుంచి 34 వారాల మధ్య రెండో కిట్‌ను అందుకుంటున్నారు.

### వనపర్తి జిల్లాలో 1,200 కిట్లు పంపిణీ

వనపర్తి జిల్లాలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి న్యూట్రిషన్ కిట్ల పంపిణీని ప్రారంభించారు. తొలి రోజే 40 మందికి పంపిణీ చేశారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1200 కిట్లను అందజేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి ఇస్మాయిల్ తెలిపారు.

### పౌష్టికాహారం వస్తువులు

గర్భిణులకు అందించే న్యూట్రిషన్ కిట్లలో పౌష్టికాహారం వస్తువులు అందిస్తున్నారు. న్యూట్రిషన్ మిక్స్ పౌడర్ (మదర్ హార్లిక్స్, కేజీ), ఖర్జూర కేజీ, ఐరన్ సిరప్ బాటిల్స్ 3, నెయ్యి అర్ధ కిలో, పల్లీపట్టి 200 గ్రాములు, ఆల్బెండజోల్ టాబెట్లు, తాగడానికి అవసరమైన ప్లాస్టిక్ కప్పును అందిస్తున్నారు.

### రెండోసారి తీసుకున్నా..

మొదటి సారి న్యూట్రిషన్ కిట్‌ను మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా తీసుకున్నా. తర్వాత వీటిని వాడడం మొదలుపెట్టాను. చాలా బాగుంది. ఇందులో పౌష్టికాహారానికి సంబంధించిన వస్తువులు ఉన్నాయి. వీటిని తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటున్నా. రెండో సారి తీసుకుంటున్నాను. పుట్టబోయే బిడ్డకు ఆరోగ్యంగా ఉంటాడని వైద్యులు చెప్పారు. అందుకే క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని వాడుతున్నాను.

- సంధ్యారాణి, గర్భిణి, వనపర్తి